ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు అసంపూర్తి..!

- చెన్నూర్‌లో పనులు పూర్తికాక ముందే ప్రారంభోత్సవం..
- మందమర్రి, క్యాతనపల్లిలో 50శాతం పూర్తి..
- ఇబ్బంది పడుతున్న వ్యాపారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు


చెన్నూర్‌లో అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్

చెన్నూర్: నియోజకవర్గంలో సరైన మార్కెట్ల సౌకర్యం లేకపోవడంతో కూరగాయాల వ్యాపారులు రోడ్లకు ఇరువైపులా అమ్మకాలు సాగిస్తున్నారు. రోడ్ల పక్కన వేజ్, నాన్‌వేజ్ విక్రయాలు చేపడుతుండడంతో ఆహార పదార్థాలపై దుమ్ము, ధూళీ పడి ప్రజలు అనారోగ్య పాలవుతున్నారనే ఉద్దేశంతో ఆధునిక మార్కెట్ల నిర్మాణానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని చెన్నూర్, మందమర్రి, క్యాతన్‌పల్లి మూడు మున్సిపాలిటీలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలకు రూ.27.75కోట్ల నిధులు మంజూరయ్యాయి. చెన్నూర్, మందమర్రి మున్సిపాలిటీలకు రూ.9.50కోట్లు కాగా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీకి రూ.9.75కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. మూడు మున్సిపాలిటీలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పనులు ప్రారంభమైనప్పటికీ నేటికి పూర్తి కాలేదు. మూడు మున్సిపాలిటీలలో అంసపూర్తిగానే మిగిలిపోయాయి. చెన్నూర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం పూర్తి కాకముందే గతేడాది మాజీ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. భవనం ప్రారంభించినప్పటికీ నేటికి పనులు పూర్తి కాలేదు. అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా మార్కెట్ల నిర్మాణాలు ఆగిపోయాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నేటికీ రోడ్ల మీదనే అమ్మకాలు..

చెన్నూర్ నియోజకవర్గంలో చెన్నూర్, మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలలో ప్రత్యేక మార్కెట్లు లేకపోవడంతో బజార్లలో కూరగాయాలు విక్రయిస్తున్నారు. రోజురోజుకూ మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతున్న తరుణంలో రోడ్లపై వాహనాల రాకపోకలు పెరిగిపోయాయి. కూరగాయాలు రోడ్ల పక్కనే ఉండడంతో ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. మరో పక్క కూరగాయలు, మటన్, చికెన్‌లపై దుమ్మూధూళి పడడంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల, వ్యాపారుల సౌకర్యార్థం అధికారులు స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురారావాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

గత ప్రభుత్వ హయంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాలకు నిధులు మంజూరైన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు చెన్నూర్ మార్కెట్ 70శాతం పనులు పూర్తి కాగా, మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలలో 50శాతం పనులు అయ్యాయి. కొత్త ప్రభుత్వం నుంచి నిర్మాణాల విషయంలో ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు చేపడుతాం.

– అనిల్, పబ్లిక్ హెల్త్ ఏఈ

త్వరగా పూర్తి చేయాలి..



చెన్నూర్‌లో రోడ్ల పైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. ఎలాంటి షెడ్లు లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పొట్టకూటి కోసం వ్యాపారాలు చేస్తున్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. చెన్నూర్‌లో మూడు నెలల క్రితమే పనులు పూర్తి కాకుండానే ప్రారంభించారు. ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. అధికారులు నిర్లక్ష్యం వదిలి, సకాలంలో పనులు పూర్తి చేసి వేజ్, నాన్ వేజ్‌లు ఒకే చోట విక్రయాలు జరిగేలా చర్యలు చేపట్టాలి.

– తగరం నరేశ్, పీజీ విద్యార్థి, చెన్నూర్

కోళ్ల వ్యర్థాలతో దుర్గంధం..!


నెన్నెలలో సబ్‌స్టేషన్ పక్కనే వేసిన కోళ్ల వ్యర్థాలు

- రోడ్ల పక్కనే చెత్త పడేస్తున్న వైనం..
- పలుచోట్ల నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు
- అయినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


నెల్కివెంకటాపూర్–తానిమడుగు వెళ్లే రోడ్డులో చెత్త

నెన్నెల: మండల కేంద్రంలోని చికెన్ వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను, చనిపోయిన కోళ్లను సబ్‌స్టేషన్ ఎదుట ఉన్న కుమ్మరివాగు కాలువలో వేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. వ్యర్థాలు కుళ్లి కంపుకొడుతుండటంతో ప్రయాణికులు, వాకర్స్, సబ్‌స్టేషన్ సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ ప్రదేశానికి రాగానే ఒక్కసారిగా వచ్చే కంపు వాసనను భరించలేక ముక్కు మూసుకొని పోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రానికి చేరుకోవాలంటే అధికారులు, ప్రజలు నిత్యం ఈ దారి గుండే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఆ వ్యర్థాలను తినడానికి వచ్చిన కుక్కలు పొట్లాడుకుంటూ రోడ్లపైకి వస్తుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామస్తులు అధికారులకు తెలిపినా, ముక్కు, కళ్లు మూసుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారే తప్పా.. పట్టించుకోవడం లేదు. చికెన్ దుకాణ యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఈ పరిస్థితి తలెత్తుతుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. కుమ్మరివాగు వంతెన మామిడి తోట, సబ్‌స్టేషన్ ప్రాంతాలలో ఈ వ్యర్థాలను వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దుకాణ యజమానులపై చర్యలు తీసుకొని వ్యర్థాలను ఆ ప్రాంతాల్లో వేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కనే చెత్త..!

దండేపల్లి: పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అన్ని గ్రామాల్లో చెత్తను వేసేందుకు డంపింగ్ షెడ్లు నిర్మించింది.. కానీ అవి చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. మళ్లీ ఎప్పటిలాగే రోడ్ల పక్కనే, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను పడేస్తున్నారు. దీంతో రోడ్ల వెంట చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్ నుంచి తానిమడుగు వెళ్లే రోడ్డు పక్కన చెత్తకుప్పలు పేరుకుపోయాయి. దీంతో అక్కడే తగులబెడుతున్నారు. పల్లెప్రగతిలో భాగంగా రూ.లక్షలు వెచ్చించి సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించి, కొన్నిచోట్ల సేంద్రియ ఎరువులు తయారు, తడి, పొడి చెత్త వేరు అన్ని ఎన్నో చెప్పినప్పటికీ అవన్నీ, ఎక్కడ కూడా ఆచరణలో కార్యరూపం దాల్చకపోవడంతో, సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా కనిపించడమే కాకుండా గ్రామాల్లోని చెత్త అంతా రోడ్లపక్కనే వేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెత్తను రోడ్ల పక్కన కాకుండా సెగ్రిగేషన్ షెడ్లలో వేసేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలి


రఘునాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న రాకేశ్

మంచిర్యాలటౌన్: భారతీయ జనతా యువ మోర్చా(బీజెవైఎం) జిల్లా అధికార ప్రతినిధిగా పనిచేస్తున్న తనకు బీజెవైఎం జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని పల్లి రాకేశ్ మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌కు వినతిపత్రం అందించారు.

కన్యకాపరమేశ్వరి వద్ద ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న మహిళలు

వేమనపల్లి: స్థానిక అన్నపూర్ణ విశ్వేశ్వరాలయం వద్ద మంగళవారం కన్యకాపరమేశ్వరి దేవి వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు రోజుల క్రితం దేవీ విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, నిత్యం భజనకీర్తణలు, ప్రత్యేక పూజలు హోరెత్తుతున్నాయి. మహిళలు మంగళహారతులతో 108 ఫలపుష్పాలతో పూజలు చేశారు. కరీంనగర్ వాస్తవ్యులైన ఆర్యవైశ్య సంఘం పీఠాధిపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

నేడు మండల సమావేశాలు

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బ్లాక్‌పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మయ్య తెలిపారు. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు 11గంటల వరకు తమ తమ నివేదికలతో హాజరుకావాలని కోరారు.

దండేపల్లి: మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ, మండలంలోని ఎంపీటీసీలు, అన్ని గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరవ్వాలని ఎంపీడీవో కోరారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు పరామర్శ


పరామర్శిస్తున్న జాన్సన్ నాయక్

జన్నారం: పొన్కల్ పీఏసీఎస్ చైర్మన్ శీలం రమేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయనను మంగళవారం బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ పరామర్శించారు. జన్నారం మండలంలోని పొన్కల్‌లో గల తన నివాసానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి దిగులు పడొద్దని, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు రాజారాం రెడ్డి, మార్కెట్ కమిటీ జిల్లా డైరెక్టర్ భరత్ కుమార్, పొన్కల్ సర్పంచ్ జక్కు భూమేష్, బీఆర్‌ఎస్ నాయకులు జనార్దన్, సుశీల, శ్రీనివాస్, శ్రీధర్, బీవీఎస్ నాయక్, శ్రీనివాస రెడ్డి తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు


రశీదు ఇస్తున్న గడియారం శ్రీహరి

చెన్నూర్: చెన్నూర్ తాలూకా యూనిట్ పరిధిలోని కోటపల్లి, చెన్నూర్, భీమారం మండలాల్లోని రెవెన్యూ ఖజానా, పంచాయితీరాజ్, అటవీశాఖ, ఆరోగ్య–వైద్య, వ్యవసాయ, నీటిపారుదల, శాఖల్లో పనిచేసే నాన్ గెజిటెడ్ ఎంప్లాయీస్ సభ్యత్వ నమోదు చేసుకోవాలని సంఘం చెన్నూర్ తాలూకా అధ్యక్షుడు గడియారం శ్రీహరి పిలుపునిచ్చారు. చెన్నూర్ తాలూకా పరిధి అధ్యక్షుడు మామిడి రాజన్న ఆధ్వర్యంలో మంగళవారం స్థానికంగా డివిజనల్ ఫారెస్ట్ ఆఫీస్ వద్ద పలువురికి సభ్యత్వ నమోదు రశీదులు అందించారు. కార్యక్రమంలో కేంద్ర సంఘం కార్యదర్శి పొన్నం మల్లయ్య, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు గోపాల్, నాయకులు రామ్‌కుమార్ దివాకర్, సత్యనారాయణ, కరీం తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రత.. మనందరి బాధ్యత


భీమారం: మాట్లాడుతున్న ఆర్టీఏ అధికారి శ్రీనివాస్

జైపూర్: రోడ్డు భద్రత మనందరి బాధ్యత కావాలని, ఫలితంగా రోడ్డు ప్రమాదాలను నివారించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కొమ్ము శ్రీనివాస్ తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలో 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమాలను అందరూ పాటించాలన్నారు.

భద్రత నియమాలు పాటించాలి

భీమారం: వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మంచిర్యాల ఆర్టీఏ అధికారి శ్రీనివాస్ డ్రైవర్లను కోరారు. మండల కేంద్రంలో రోడ్డు భద్రతావారోత్సవాల సందర్భంగా మంగళవారం అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, అతివేగంగా నడపడం ప్రమాదకరమని సూచించారు. ప్రతి ఒక్క డ్రైవర్ లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. వాహనాల్లో పరిమితికి మించిన ప్రయాణికులకు ఎక్కించుకోరదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కేంద్రంలోని ఆటోడ్రైవర్లతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


సర్పంచులను సన్మానిస్తున్న అధికారులు

భీమిని: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు పలు అంశాలపై అధికారులతో చర్చించారు. సర్పంచులు ఈ నెల 30న పదవీ కాలం ముగియనున్న సందర్భంగా, చివరి సర్వసభ్య సమావేశం కావడంతో అధికారులు సర్పంచులకు శాలువాలతో, పూలతో సన్మానం చేశారు. అధికారులు సమయపాలన పాటించలేదు. పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి ఆసక్తి చూపకపోవడంతో, కేవలం అరగంటలోనే సర్వసభ్య సమావేశం ముగించారు. తిమ్మాపూర్ భూముల వ్యవహారం సర్పంచ్ ఇందూరి భూమయ్య మాట్లాడుతూ.. 600ఎకరాల భూమి సర్వే నంబర్ 1 నుంచి 59నంబర్లలో భూమిరీ సర్వే చేపట్టినా కూడా పట్టా పాసు పుస్తకాలు జాప్యం చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏఎంసీ చైర్మన్ బోనగిరి నిరంజన్‌గుప్తా, వైస్ ఎంపీపీ చిలుముల మధు, ఎంపీడీఓ జవహర్‌లాల్, తహసీల్దార్ బికర్ణదాస్, ఎంపీఓ సఫ్దార్‌ఆలీ, తాండూర్ ఎఫ్ఎస్ఓ సువర్ణ, సర్పంచ్‌లు ఎల్లాగౌడ్, సంతోష్, భూమయ్య, కవిత, తులసీబాయి, ఎంపీటీసీలు మమత, సంతోష్, ఏఈపీఆర్ రాంచందర్, ఏపీఓ భాస్కర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ లలిత తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల తీరుపై విచారణ


చెన్నూర్ వ్యవసాయ కార్యాలయంలో విచారణ నిర్వహిస్తున్న భీమిని ఏడీఏ

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో అధికారులతోపాటు కింది స్థాయి సిబ్బంది కొంత కాలంగా ఫర్టిలైజర్ డీలర్ల వద్ద చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫర్టిలైజర్ డీలర్‌షిప్ జారీకి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీటిపై భీమిని ఏడీఏ ఇఫ్తికర్ చెన్నూర్ వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో మంగళవారం విచారణ చేపట్టారు. స్థానిక అధికారులు, డీలర్ల ఎదుటే విచారణ చేపట్టడం అనుమానాలకు తావిస్తోంది. డీల ర్ల నుంచి డబ్బుల వసూలు గురించి రహస్యంగా విచారణ చేపట్టాల్సి ఉంది. కానీ, ఏడీఏ, ఏవో ఎదుటే విచారణ చేపట్టడం గమనార్హం.

నూతన కార్యవర్గం

కోటపల్లి: తెలంగాణ పంచాయతీ కార్యదర్శి ఫెడరేషన్ కోటపల్లి మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ మండల అధ్యక్షుడిగా సరిగమల సదయ్య, ఉపాధ్యక్షులుగా తిరుపతి, శైలజ, సత్యనారాయణ, దర్శనాల కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా సందీప్, జాయింట్ సెక్రటరీలుగా శ్రీవిద్య, రమేశ్, కుడిమేత రమే శ్, శ్యామల, కోశాధికారిగా రాళ్లబండి సంతో శ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శిల్ప, సమ్మయ్య, వెంకటేశ్వర్, రవికుమార్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శులుగా శివకృష్ణ, రాజశేఖర్, కమిటీ సభ్యులుగా రాజన్న, స్వర్ణ, రమాదేవి, తిరుపతి, దామోదర్‌రెడ్డి, గౌరవ సలహాదారుగా తాజోద్దీన్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

జన్నారం: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం జన్నారం మండల కేంద్రంలోని ఎన్ఎస్‌యూఐ కార్యాలయంలో సంబురాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ రియాజోద్దీన్, సీనియర్ నాయకులు శుభాష్‌రెడ్డి, ఫసీఉల్లా, కరుణాకర్, రమేశ్, రజాక్, ఇందయ్య, ఎన్ఎస్‌యూఐ నాయకులు గణేశ్, రాకేశ్, రఘువర్ధన్, రాజేశ్, తరుణ్, అజ్మత్, బన్ని తదితరులు పాల్గొన్నారు.

అట్ట ముక్కలతో రామమందిరం



లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన అప్పని అర్చన అట్ట ముక్కలతో రామ మందిరాన్ని తయారు చేసి పలువురిని అబ్బుర పరిచింది. మాస్టర్ ఆఫ్ ఫార్మసీ చదువుతున్న అర్చన రామ మందిరాన్ని తయారు చేడయంతో పలువురు అభినందిస్తున్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి


నివాళి అర్పిస్తున్న నాయకులు

నస్పూర్: భారత స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తీగల్‌పహాడ్‌లో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు ఆయనకు నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, తీగల్ పహాడ్ ఏరియా కార్యదర్శి అచ్చరీష్, నాయకులు బానేష్, రాజలింగు, తిరుపతి, మహేశ్, సాయి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఒత్తిళ్లకు లోనుకావద్దు'


మాట్లాడుతున్న వైద్యాధికారి రమేశ్

మందమర్రిరూరల్: ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిళ్లకు లోను కావద్దని ప్రభుత్వ వైద్యాధికారి రమేశ్ సూచించారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కృష్ణయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరీక్ష సమయంలో విద్యార్థులు ఒత్తిళ్లకు లోనవడం సహజమని, వాటిని ఎలా ఎదుర్కోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. గంజాయి, పొగాకు లాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని సూచించారు. పరీక్షల సమయంలో సరైన పోషకాహారం తీసుకోవాలని, లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో గంగాధర్, హెల్త్ సూపర్‌వైజర్ మల్లిక, కళాశాల అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

కాసిపేట: విద్యార్థులు ఇష్టంతో చదివితేనే ఉన్నతస్థాయికి చేరడం సాధ్యమవుతుందని మోటివేటర్ మద్దెవేణి అర్జున్ తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు 200మందికి సబ్జెక్టులు, పరీక్షలపై మంగళవారం అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు గురికాకుండా ఒక్క స్థిరమైన లక్ష్యాన్ని ఎంచుకొని, నిరంతరం లక్ష్య సాధనకు కృషి చేస్తే జీవితంలో తప్పకుండా విజయం సాధించవచ్చని సూచించారు. కోరిక, కళ, సంకల్పం, అంకితభావం, క్రమశిక్షణ అనే సూత్రాలు పాటిస్తే తప్పకుండా విజయం దరి చేరుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమల్లయ్య, సామాజిక చైతన్య వైదిక మండలాధ్యక్షుడు మల్లయ్య, చిన్నభీమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట 2 గనిపై పదోన్నతి పత్రాలు అందజేత


పదోన్నతి పత్రాలు అందజేస్తున్న లక్ష్మీనారాయణ

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2 గనిపై మంగళవారం 13మంది ఉద్యోగులకు వివిధ కేటగిరిలలో టైం రేటెడ్ వేకెన్సీస్ ప్రమోషన్ పత్రాలను గని మేనేజర్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 7 హాలేజ్ ఆపరేటర్(అండర్‌గ్రౌండ్), 4 ట్రామర్ (అండర్‌గ్రౌండ్), 1 హాలేజ్ ఆపరేటర్ సర్ఫేస్, 1 సపోర్ట్ మెన్ పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. ప్రమోషన్లు పొందిన ఉద్యోగులు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచే విధంగా నైపుణ్యంతో పనిచేయాలన్నారు. ప్రతీ ఉద్యోగి సంస్థ నాది అనే ధీమాతో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధిస్తూ, సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, రక్షణాధికారి సంతోష్‌రావు, ఫిట్ ఇంజనీర్ రఘు, సంక్షేమాధికారి బార్గవ్, సూపర్‌వైజర్లు, కార్మికులు తదితరులున్నారు.

ఎస్‌హెచ్‌జీల వ్యాపారాల పరిశీలన



మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని మహిళా స్వయం సహాయక గ్రూప్ సభ్యులు చేపడుతున్న వ్యాపారాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాతమంచిర్యాలలో అనిత ఎస్‌హెచ్‌జీ గ్రూప్ వారి కంప్యూటరైజ్డ్ మగ్గం వర్క్స్, అక్కడే మహిళా సంఘ సభ్యురాలు కొత్తపల్లి సుజాత తయారు చేస్తున్న శ్రీరామ ప్లేట్ వర్క్స్, హమాలివాడలో సభ్యురాలు జ్యోతి నిర్వహిస్తున్న న్యాప్‌కిన్స్ తయారీ కేంద్రంతో పాటు, సాయికుంటలో కోళ్ల ఫారం ఏర్పాటు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మెప్మా ఇన్‌చార్జి చంద్రయ్య, సుజాత, అరుణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

క్యాలెండర్ ఆవిష్కరణ

దండేపల్లి: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన 2024క్యాలెండర్, డైరీలను స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి చిన్నయ్య, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు తులసీపతి, సంఘనాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాతమంచిర్యాల: సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్ సతీమణి షాహిన్ సుల్తానా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమె మృతిపట్ల సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

'రాష్ట్రపతిని అవమాన పరచడం దారుణం'

కాసిపేట: అయోధ్యలో సోమవారం జరిగిన బాలరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి దేశ రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును పిలవకపోవడం దారుణంగా అవమాన పరచడమేనని ఆదివాసీ సంఘాల నాయకులు విమర్శించారు. మండలంలోని కొండపూర్‌లో మంగళవారం తుడుందెబ్బ విద్యార్థి సంఘం నాయకులు విలేకరులతో మాట్లాడారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తుడుందెబ్బ జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ కిషన్, రాయిసిడాం రమేష్, తిరుపతి, పెంద్రం శంకర్, రాందాస్, రమేష్ తదితరులున్నారు.

విద్యార్థికి సైకిల్ అందజేత

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థికి మంచిర్యాల మహిళా తరంగిని ఆధ్వర్యంలో మంగళవారం సైకిల్ పంపిణీ చేశారు. రంగపేట్‌కు చెందిన పేద విద్యార్థిని అఖిల పదోతరగతి చదువుతున్నారు. ప్రత్యేక తరగతుల నేపథ్యంలో పాఠశాల దూరంగా ఉండటంతో పడుతున్న ఇబ్బందులను మమత సంస్థ సభ్యుల దృష్టికి తీసుకెళ్లగా సైకిల్ అందజేశారు.

ఎంఈవోకు వినతి

బెల్లంపల్లి: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్య నిర్వాహక సభ్యుడు దీపక్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎంఈవో మహేశ్వర్ రెడ్డికి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం వినతిపత్రం అందజేశారు. శ్రీరామ పాఠశాలలో శ్రీ చైతన్య పాఠశాల పేరుతో అడ్మిషన్లు తీసుకుంటూ, నోట్ బుక్స్, మెటీరియల్ పంపిణీ చేస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను మభ్య పెడుతున్నారన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ ఆర్థిక దోపిడీకి గురి చేస్తున్నారని, ర్యాంక్‌ల పేరిట మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

ఆర్థిక సాయం

మందమర్రిరూరల్: పట్టణంలోని దీపక్ నగర్‌కు చెందిన కుంచాల ఆంజనేయులు ఇటీవల మృతిచెందాడు. కాగా సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ వాకర్స్ ఆధ్వర్యంలో నగదు రూ.17,017 సేకరించి మంగళవారం మృతుడి భార్యకు అందజేశారు.